క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఖమ్మం బురహాన్‌పురానికి చెందిన గుడ్ల శ్రీనివాసరెడ్డి, సరిత దంపతులు రూ.5116 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు.

ప్రభుత్వ అధ్యాపకుల జిల్లా కార్యవర్గం ఎన్నిక


పి.విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు ఆదివారం శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగాయి. ఖమ్మం ప్రభుత్వ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.విజయ్‌కుమార్, కార్యదర్శిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇల్లెందు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.కిరణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి కే.సురేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యాపకుల సమస్యలపై, కళాశాలల అభివృద్ధికై వారి వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అధ్యాపకులు డి.భద్రయ్య, కామేశ్వరరావు, సూరంపల్లి రాంబాబు, కుక్కల కార్తీక్, డి.రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: ఈనెల 25వ తేదీన కొత్తగూడెంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక పాత పాల్వంచలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. మంతపురి రాజుగౌడ్, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, బరపటి వాసుదేవరావు, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూ

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా జీఎం షాలేము రాజు ఆదేశాల మేరకు కారుణ్య నియామకాల కొరకు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగి వారసుడికి ఎస్‌ఓటూ జీఎం కార్యాలయంలో ఆదివారం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య మాట్లాడుతూ.. ఇల్లందు ఏరియా ఎస్‌అండ్‌పీసీ విభాగం నుంచి కారుణ్య నియామకాల కోసం వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం ఉత్తర్వులను పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. డీజీఎం జీవీ మోహన్‌రావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయిస్వరూప్, సీనియర్ అసిస్టెంట్ జి.రవి పాల్గొన్నారు.

సమసమాజ స్థాపకుడు బసవేశ్వరుడు


పూలమాల వేస్తున్న బసవేశ్వరుడు

కొత్తగూడెంరూరల్: సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సురేందర్ అన్నారు. ఆదివారం బసవేశ్వరుని 890వ జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ సమావేశపు హాలులో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి గన్యాతో కలిసి బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురేందర్ మాట్లాడుతూ.. కుల, వర్ణ, వర్గ, జాతి, లింగ, మత వివక్ష లేని సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడని కొనియాడారు. బసవేశ్వరుడి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషమన్నారు. కార్యక్రమంలో మెట్టెల సైదుబాబు, పల్లె వీరప్రసాద్, రెడ్డిమల్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెరిసి మురిసిన గౌతంపూర్!

- జాతీయ స్థాయిలో ఉత్తమ జీపీగా ఎంపిక
- రాష్ట్రపతి చేతుల మీదుగా 'హెల్తీ పంచాయతీ' అవార్డు స్వీకరణ
- అభివృద్ధికి తోడు ప్రత్యేకతలతో అలరారుతున్న జీపీ


రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ సుజాత, కార్యదర్శి షర్మిల, కలెక్టర్ అనుదీప్ (ఫైల్)

చుంచుపల్లి: ఒకప్పుడు జిల్లా వాసులకే తెలిసిన ఆ గ్రామపంచాయతీ ప్రతిభ నేడు జాతీయస్థాయిలో మార్మోగుతోంది. చుంచుపల్లి మండలంలో 2019లో ఏర్పడిన గౌతంపూర్ గ్రామపంచాయతీ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు సాధించింది. జాతీయస్థాయిలో ఉత్తమ ఆరోగ్య పంచాయతీ(హెల్తీ గ్రామపంచాయతీ)గా మొదటిస్థానంలో నిలవడం ద్వారా మరింత గుర్తింపు దక్కింది. రాష్ట్రస్థాయిలో మంత్రి కేటీఆర్, జాతీయస్థాయిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సర్పంచ్ పొడియం సుజాత, కార్యదర్శి జక్కం షర్మిల.. కలెక్టర్ అనుదీప్ సమక్షాన అవార్డులు అందుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో పంచాయతీ సిబ్బంది, పాలకవర్గం సమన్వయంతో పని చేస్తూ వంద శాతం లక్ష్యాలను సాధిస్తుండడంతో ఈ అవార్డు దక్కినట్లయింది. గత ఏడాది అక్టోబర్‌లో అవార్డు కోసం తొమ్మిది అంశాల్లో దరఖాస్తు చేసుకోగా.. హెల్తీ పంచాయతీ విభాగంలో మొదటి స్థానం దక్కించుకున్న నేపథ్యాన కేంద్రం నుంచి రూ.కోటి నజరానా అందింది.


మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంట్


వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

అవార్డు రావడానికి దోహదపడిన అంశాలు...

గౌతంపూర్ గ్రామంలో డ్రెయినేజీల ద్వారా వెలువడే నీటిని మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లోకి తరలించిన తర్వాత ఇంటిక్ వెల్ నుంచి ఫ్లాక్ లెటర్‌లో శుద్ధి చేస్తారు. ఆపై ఫిల్టర్ బెడ్ నుంచి ఔట్‌లెట్ ద్వారా పొలాలకు సరఫరా చేస్తున్నారు. ఇలా శుద్ధి చేసిన జలాలను గ్రామ పరిధిలోని 15 నుంచి 20 ఎకరాలకు అందుతుండగా.. ఈ ప్రక్రియ జిల్లాలోనే కాదు మరెక్కడా లేదు. తద్వారా అవార్డుల ర్యాంకింగ్‌లో ఎక్కువ మార్కులు వచ్చాయి. ఇక గ్రామంలో ఉదయం ఆరుగంటలకే పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తారు. ఈ చెత్తలో తడి చెత్త–పొడి చెత్తను వేరుచేసి డంపింగ్ యార్డ్‌లో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. అనంతరం ఎరువును రైతులకు విక్రయిస్తుండడంతో జీపీకి ఆర్థిక వనరులు సమకూరుతున్నాయి. వారంలో రెండు రోజులు బుష్ క్లియరింగ్ పాటు దోమల నివారణకు ఫాగింగ్ పక్కాగా చేస్తున్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికి సర్వే చేపట్టి వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించడమే కాక మందులు ఇస్తూ ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతోంది. పల్లె ప్రకృతి వనాల్లో ఆహ్లాదకరమైన మొక్కలు పెంచి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. అలాగే, స్విమ్మింగ్ పూల్, టెన్నిస్ కోర్టు, జిమ్ సౌకర్యాలను గ్రామస్తులు వినియోగించుకుంటున్నారు.

కలలో కూడా ఊహించలేదు..



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటానని కలలో కూడా ఊహించలేదు. ప్రజలు, పాలకవర్గ సభ్యుల సహకారం, అధికారుల ప్రోత్సాహంతో ఇది సాధ్యమైంది. గ్రామ మొదటి సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను. ఇంకా పలు సౌకర్యాలు కల్పించాలనే యోచనలో ఉన్నాం.

– పొడియం సుజాత, సర్పంచ్

ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో...



ప్రజలకు ఎంతోకొంత సేవ చేయాలనే లక్ష్యంతో కార్యదర్శిగా విధుల్లో చేరాను. విధి నిర్వహణలో కొన్ని సవాళ్లు ఎదురైనా ముందుకు సాగుతూ వెళ్తున్నాను. గ్రామసర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, ప్రజల సహకారం తోడ్పడింది. ముఖ్యంగా ఉన్నతాధికారుల ప్రోత్సాహంతోనే జాతీయ స్థాయి అవార్డు దక్కింది.

– జె.షర్మిల, కార్యదర్శి

ఇది గొప్ప విషయం



జాతీయస్థాయిలో ఆరోగ్య పంచాయతీగా గౌతంపూర్ జీపీ అవార్డు దక్కించుకోవడం చాలా ఆనందంగా ఉంది. జాతీయస్థాయిలో గౌతంపూర్ నిలవడం గొప్ప విషయం. పంచాయతీ పాలకవర్గం అభివృద్ధిపై మొదటి నుంచి ప్రత్యేక దృష్టి సారించటం వల్లే ఇది సాధ్యమైంది. గౌతంపూర్ పలు పంచాయతీలకు ఆదర్శంగా నిలవనుంది.

– గుంటి సత్యనారాయణ, ఎంపీటీ

26 నుంచి ఎంసెట్, నీట్ మోడల్ పరీక్ష


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఏప్రిల్ 26, 27, 28 తేదీలలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంసెట్ మోడల్ పరీక్షను జయప్రదం చేయాలని, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం కోరారు. ఆదివారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని మంచికంటి భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మోడల్ పరీక్షల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 30న నిర్వహించే మోడల్ నీట్ పరీక్షలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను పరిశీలించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ద్వారా ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో తమకు ఎన్ని మార్కులు వస్తాయో అంచనా వేసుకొని మరింత బాగా చదుకోవాలన్నారు. దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీల నిష్ణాతులైన ఆచార్యులచేత ప్రశ్నపత్రాలను తయారు చేయనున్నట్లు తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహించే ఈ పరీక్షలకు ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య కన్వీనర్‌గా వ్యవహరించనున్నారని పేర్కొన్నారు. ఎంసెట్, నీట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్ష ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు ఎంట్రీ ఫీజు రూ.100 ఉంటుందని, వివరాలకు 9492930835 8309315251 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్, డివిజన్ అధ్యక్షుడు బోడ అభిమిత్ర, జిల్లా కమిటీ సభ్యులు జమ్మి జశ్వంత్, మంద నాగకృష్ణ, భవ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం

పాల్వంచ: ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ఐక్య తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు గోపిక రత్నాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ అధ్యక్షులు బోగ లక్ష్మి పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. వాసుమల్ల గౌతమ్, లైబ్రేరియన్ కె.మధుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఉదయం 11గంటల నుంచి జరిగిన పరీక్షకు విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థులను ఆధ్యాపకులు తనిఖీ నిర్వహించి పరీక్ష హాల్‌లోకి పంపించారు. మొత్తం 384 మంది విద్యార్థులకు గాను 338 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం నిర్వాహకులు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి

ఇల్లెందురూరల్: మండలంలో ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తక్షణం ప్రారంభించాలని బోయితండా సర్పంచ్ బానోత్ సంతు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో మొక్కజొన్న అత్యధికంగా సాగైన ఇల్లెందు మండలంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. ఇప్పటికే అధిక సంఖ్యలో రైతులు మొక్కజొన్న కంకులు కోసి గింజలు ఆరబెట్టి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేక కొందరు రైతులు పంటను నిల్వ చేసుకునే అవకాశం లేక క్వింటాకు రూ.200 వరకు నష్టంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకుంటున్నారని వాపోయారు. మార్క్‌ఫెడ్ అధికారులు తక్షణం స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగ నిరసన దీక్షను విజయవంతం చేయండి


పాల్వంచ: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు


పాల్వంచ: నేడు ఖమ్మంలో తలపెట్టిన నిరుద్యోగ నిరసన దీక్ష, ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నిరసన ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నరసింహాచారి, చాంద్ పాషా, శ్రీనివాసరావు, చంద్రగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం ఖమ్మంలో జరగనున్న విద్యార్థి, నిరుద్యోగ నిరసన దీక్షను విజయవంతం చేయాలని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు అన్నారు. సుజాతనగర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ, 10వ తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిరుద్యోగ నిరసన దీక్ష చేపట్టినట్లు తెలిపారు. దీక్షకు మద్దతుగా నియోజకవర్గం విద్యార్థి, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నిరుద్యోగులు భారీగా తరలివచ్చి సంఘీభావం తెలపాలని కోరారు.

మిర్చి, మామిడి రైతులను ఆదుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): అకాల వర్షాలకు నష్టపోయిన మామిడి మిర్చి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన వర్షానికి కల్లాల్లో నిల్వ ఉంచిన మిర్చి నీటి పాలైందని, అదేవిధంగా ఈదురుగాలులకు మామిడి కాయలు నేలమట్టం అయ్యాయని, దీంతోపాటు పేదలు నివాసముండే గుడిసెలు, రేకుల ఇళ్లు ధ్వంసం అయి నిరాశ్రయులయ్యారన్నారు. సంబంధిత అధికారులు జరిగిన నష్టంపై సర్వే చేపట్టి, ప్రభుత్వానికి నివేదిక అందించి నష్టపోయిన రైతులకు, పేదలకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమాపై నిర్లక్ష్యం వహించటం వలన అతివృష్టి, అనావృష్టితో రైతాంగం నష్టపోతున్నారని, ఇప్పటికైనా పాలకులు రైతులపై, పేదలపై దృష్టి సారించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

కార్యదర్శులను క్రమబద్ధీకరించండి


ప్రమాణం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పాల్వంచరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే క్రమబద్ధీకరించాలని లేదంటే ఈనెల 28 నుంచి సమ్మె చేస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. మండల పరిధి పెద్దమ్మగుడి వద్ద ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శులు ఐక్యంగా ఉద్యమించాలని ప్రమాణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నాలుగు సంవత్సరాలకు క్రమబద్ధీకరిస్తామని ప్రకటించారు. అయినా ఇంతవరకు పట్టించుకోవడం లేదన్నారు. ప్రొబెషనరీ కాలాన్ని సర్వీస్‌గా గుర్తించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సతీష్, సాయి, నరేష్, సంపత్, శ్రీనివాస్, నర్మద తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్లు పంపిణీ


కిట్లు అందజేస్తున్న జీఎస్‌ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు

కొత్తగూడెంరూరల్: నియోజకవర్గం పరిధిలోని టీబీ పేషెంట్లకు ఆరునెలలగా డాక్టర్ జీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 260 మందికి న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం శ్రీనగర్ కాలనీ, 3వ లైన్‌లోని టీబీ పేషెంట్లకు కిట్లను ట్రస్ట్ నిర్వాహకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. హెల్త్ డైరెక్టర్ న్యూట్రిషన్ కిట్లను అందజేసి మా జీవితాల్లో వెలుగు నింపారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీబీ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు, ట్రస్ట్ మేనేజర్ చంద్రగిరి, అంజి, కోఆర్డినేటర్ మోదుగు జోగారావు, ప్రభాకర్, రాజు, బోడ వినోద్, బల్లా రాఫ్ప్రెయిల్, డి.సర్వన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్


క్రికెట్ ఫైనల్ పోటీని ప్రారంభిస్తున్న ఎడవల్లి కృష్ణ


బహుమతులు అందజేస్తున్న నాగా సీతారాములు

పాల్వంచరూరల్: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని టీపీసీసీ సభ్యుడు ఎడవల్లికృష్ణ, టీపీసీసీ సభ్యులు నాగాసీతారాములు అన్నారు. మండల పరిధి దంతలబోరు గ్రామపంచాయతీ గొల్లగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ఎడవల్లి ప్రారంభించగా, విజేతలకు నాగా సీతారాములు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రతిభ చూపాలన్నారు. క్రీడలు ఆడటం వలన నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ.కరీంపాషా, కొత్తగూడెం మండలం ఓబీసీ అధ్యక్షుడు అమరగాని జయ ప్రకాశ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి మనోహర్, నాగరాజు, కిరణ్, మెంటం రాము, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దగ్ధమైన మొక్కజొన్న పంట పరిశీలన


పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన మొక్కజొన్న పంటను అధికారులు, ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నేతలు ఆదివారం సందర్శించారు. పంట నష్టంపై సర్వే చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రంగాప్రసాద్, విద్యుత్ ఏఈ మధుబాబు, వ్యవసాయ శాఖ ఏఈఓ భానులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని రైతులతో కలిసి పార్టీల నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సుమారు 50 ఎకరాల్లో రైతుల పండించిన పంట దగ్ధమైందని, సుమారు రూ.25లక్షల వరకు నష్టం జరిగిందన్నారు. పంట నష్టపోయిన వారిలో కౌలు రైతులు కూడా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సోయం భిక్షమయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సీపీఎం పట్టణ కార్యదర్శి దొడ్డా రవికుమార్, స్థానికులు సాంబశివరావు, నాగభూషణం, సత్యనారాయణ, మేక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి


సంఘీభావం తెలుపుతున్న రమేష్‌రాథోడ్

పాల్వంచరూరల్: ఐకేపీ వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకుడు రమేష్ రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఓఏల దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 900 మంది వీఓఏలు ఉన్నారని వారికి నెలకు రూ.3,600 వేతనం ఇస్తూ శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వం వీఓఏలకు గతంలో ఇచ్చిన హామీలను అమలుచేయకపోగా పనిభారం పెంచిందన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, గ్రేడింగ్ పద్ధతిని రద్దు చేయాలని, సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.అనురాధ, ఎన్.రమేష్, మహేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మేదర సంఘం ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో సంఘం సభ్యులు

ఇల్లందు: మేదరులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, రాజకీయ చైతన్యంతోనే అభివృద్ధి సాధ్యమని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు సిలివేరు సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఇల్లందులో మేదరి మహేంద్ర కులసంఘం అధ్యక్షుడు నీలం రాజశేఖర్ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మేదర భవన నిర్మాణానికి, సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చందా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వలిపిరెడ్డి రాజలింగం, కోశాధికారి యనమగల సైదులు, గౌరవ సలహాదారులు వాసం వెంకటేశ్వర్లు, పోతు రాజమల్లు, శనగరపు శ్రీనివాస్, కొంటూ రవికాంత్, ఎనమగండ్ల రాజేందర్, పల్లి రాజమ్మ, వలిరెడ్డి మనమ్మ, కొత్తూరు లక్ష్మి, పందిలా ఉమాదేవి, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

సెంట్రల్ లైటింగ్ వెలుగులెప్పుడో..?



సుజాతనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ప్రారంభానికి మోక్షం కలగడం లేదు. సీడీపీ రూ.38 లక్షల నిధులతో 1.4 కిలోమీటర్ల మేర 27 మీటర్లకు ఒక్కోటి చొప్పున మొత్తం 27 స్తంభాలను డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసి లైట్లను కూడా అమర్చారు. ఈ పనులు పూర్తి చేసి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు లైట్లు వెలిగించడం లేదు. రాత్రి సమయాల్లో చీకటిగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. – సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : శివలాల్, పీఆర్‌ఏఈ
సెల్ నంబర్ : 9963875732